శస్త్రచికిత్స ఆలస్యం.. మంచానికి పరిమితం

- జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఇంప్లాంట్ల కొరత
- రోజులపాటు విలవిలలాడుతున్న రోగులు

ఈనాడు డిజిటల్, కామారెడ్డి

☛ ఇటీవల లింగంపేట మండలానికి చెందిన ఓ మహిళ ప్రమాదవశాత్తు కింద పడడంతో చేయి విరిగింది. చికిత్స నిమిత్తం జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించగా. . ఆరోగ్యశ్రీ పథకం కింద బాధితురాలికి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు. అందుకు కావాల్సిన ఇంప్లాంట్లు(పరికరాలు) లేకపోవడంతో గత కొన్ని రోజులుగా ఆపరేషన్ వాయిదా వేస్తూ వస్తున్నారని, ఇదిగో చేస్తాం.. అదిగో చేస్తామంటూ వైద్యులు చెబుతున్నారని బాధితులు 'ఈనాడు'తో అన్నారు. మరికొంత మంది సైతం ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు చెబుతుండటం గమనార్హం.

జిల్లా సర్వజన ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్యం అంది ఆపరేషన్లు చేస్తారనే నమ్మకంతో వచ్చే బాధితులకు నొప్పులతో పాటు నిరీక్షణ తప్పడం లేదు. శస్త్రచికిత్సలు చేయడానికి వైద్యులు సిద్ధంగా ఉన్నా.. అందుకు కావాల్సిన పరికరాలు కరవవుతున్నాయి. గత కొన్నిరోజులుగా ఈ సమస్య తీవ్రం కావడంతో రోగులు పడుతున్న ఇబ్బందులు అనేకం. ఆర్థోపెడిక్ విభాగంలో కొందరు గత 20 రోజులుగా పడకలకే పరిమితం అయ్యారు. ఆపరేషన్లకు కావాల్సిన కనీస పరికరాలు లేక రోగుల పాలిట శాపంగా మారుతోంది వారి బంధువులు వాపోతున్నారు.

పేరుకుపోయిన బకాయిలు..

గతంలో ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో ఆపరేషన్లకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేసేవారు. గత మూడేళ్లుగా సుమారు రూ.3 కోట్ల మేర నిధుల విడుదల నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఆసుపత్రి నిర్వహణ భారంగా మారడంతోపాటు పేదలకు ఉచితంగా చేయాల్సిన ఆపరేషన్లు నిలిచిపోయే దుస్థితి వస్తోంది. విరిగిన ఎముకలకు ప్లేట్లు, రాడ్లు వేయాల్సిన సమయంలో.. అవి అందుబాటులో లేవని వైద్యులు చేతులెత్తేయడం వైద్య వ్యవస్థలో నెలకొన్న నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. గతంలో నెలకు సుమారుగా 200 లకు పైగా శస్త్రచికిత్సలు జరగగా.. ప్రస్తుతం 100 లోపు జరుగుతుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

ప్రభుత్వం దృష్టి సారిస్తే మేలు..

కంటి ఆపరేషన్లు నిర్వహించేందుకు కావాల్సిన లెన్స్ కొరత, వర్షాలకు ఆపరేషన్లు చేసే గదిలోకి నీరు రావడం వంటి కారణాలతో కొన్ని వారాలుగా ఇక్కడ కంటి శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి మారుస్తామని ప్రకటనలు చేసే పాలకులు.. కనీసం రూ.వేలు విలువ చేసే చిన్నపాటి సర్జికల్ పరికరాలను అందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పేదలకు ఉచిత వైద్యం అందించే ఆసుపత్రిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.

సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం..

ఆరోగ్యశ్రీ బకాయిలు, ప్రభుత్వం ఇంప్లాంట్లు సరఫరా చేయకపోవడం వంటి సమస్యలతో ఆపరేషన్లు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి కావాల్సిన పరికరాలను సాధ్యమైనంత తర్వగా తెప్పించి ఆపరేషన్లు చేయిస్తాం. ఇప్పటికే అవసరమైన ఇంప్లాంట్ల కోసం ఆర్డర్ పెట్టాం.

- వెంకటేశ్వర్, సూపరింటెండెంట్, జీజీహెచ్, కామారెడ్డి

దొంగలు.. మళ్లీ రెచ్చిపోతున్నారు

☛ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వరుసగా ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

న్యూస్‌టుడే, నిజామాబాద్ వ్యవసాయం

అర్గుల్‌లో ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేయడంతో మూడు నెలల పాటు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల ఘటనలు తగ్గాయి. రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో మళ్లీ దొంగలు పేట్రేగిపోతున్నారు. ఓ వైపు వాతావరణ ప్రతికూలతతో వానాకాలం పంటలు కాపాడుకునేందుకు కర్షకులు పడరాని పాట్లు పడుతున్నారు. విద్యుత్, సాగు నీటి కోసం అవస్థలకు గురవుతున్నారు. ఇదే సమయంలో నియంత్రికలను ధ్వంసం చేస్తుండటంతో వారంతా తలలు పట్టుకుంటున్నారు. పంటకు నీరందక ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ నవీపేట్ మండలం అర్గుల్‌లోని ఓ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను (విద్యుత్ నియంత్రిక)ను దుండగులు ఇటీవల ధ్వంసం చేశారు.

☛ రాజంపేట మండలం బస్వన్నపల్లి శివారులోనూ ఐదు నియంత్రికలను ధ్వంసం చేసి విలువైన తీగలు, ఆయిల్ ఎత్తుకెళ్లారు. మళ్లీ కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాలో ఇలాంటి చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ఒక్కటి.. 15 ఎకరాలకు ఆధారం..

ధ్వంసం చేసిన చోట వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించే పరిస్థితి ఉండదు. ఈ లోపు పంటలకు నీరందక తీరని నష్టం వాటిల్లుతోంది. ఒక నియంత్రిక పరిధిలో సుమారు 15 ఎకరాల వరకు సాగు చేస్తుంటారు. 25 కేవీ సామర్థ్యం అయితే ఖరీదు రూ.లక్ష పైనే ఉంటుంది. దీనికోసం 50 కిలోల రాగి తీగలు, వంద లీటర్ల ఆయిల్‌ను వినియోగిస్తారు. వీటిని పగులగొట్టడం ద్వారా దుండగులు రూ.30 నుంచి రూ.40 వేలు పోగేసుకుంటున్నారని సమాచారం. గత మూడేళ్లుగా అంతర్రాష్ట్ర ముఠాలు ఎక్కువగా పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది.

నియంత్రికల ధ్వంసం ఇలా..

సం॥రం	కేసులు
2022	101
2023	132
2024	164
2025	120

బాధ్యతగా వ్యవహరిస్తేనే..

గ్రామాల్లోని ముఖ్య దారులు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పసిగట్టి పోలీసులను అప్రమత్తం చేయాలి. వాగులు, కాలువలపై సామూహికంగా మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుంటారు. అవసరమైతే పంట చేతికి అందే వరకు ఆయాచోట్ల గస్తీ ఏర్పాటు చేసుకోవాలి. కొత్త వ్యక్తులెవరైనా ఆటోలపై పొలాల దారుల్లో తిరుగుతూ రెక్కీ చేస్తున్నారనే అనుమానం వస్తే ఠాణాలో సమాచారం ఇవ్వాలి.

ఏ ప్రాంతాల్లో బెడద ఎక్కువంటే..

☛ **నిజామాబాద్ జిల్లాలో:** ఇందల్‌వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, మెండోరా, ముప్కాల్, మోర్తాడ్, మోపాల్, బోధన్ టౌన్, రూరల్, నవీపేట్, వర్ని మండలాలు..

☛ **కామారెడ్డి:** పెద్దకొడప్‌గల్, రాజంపేట్, మాచారెడ్డి, లింగంపేట్, రామారెడ్డి, తాడ్వాయి మండలాల్లోని గ్రామ శివారు పంట పొలాలు, వాగు, కాలువల ఒడ్డున ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లపైనే కన్నేస్తున్నారు.

భద్రత మన బాధ్యత: ఎస్పీ

కామారెడ్డి నేరవిభాగం: భక్తి బలం కావాలి.. భద్రత మన బాధ్యత కావాలని ఎస్పీ రాజేష్‌చంద్ర పేర్కొన్నారు. జిల్లాలోని వినాయక మండపాల నిర్వాహకులతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ విక్టర్‌తో కలిసి సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో.. సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. మండపాల భద్రతలో నిర్వాహకులదే కీలక బాధ్యతన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు రాత్రి సమయంలో నిఘా తప్పనిసరి అన్నారు. విద్యుత్తు తీగల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెచ్చగొట్టే సందేశాలకు దూరంగా ఉండాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాస్‌రావు, విఠల్‌రెడ్డి, పట్టణ సీఐ నరహరి, అధికారులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎస్పీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్ తదితరులు

రాయితీ బకాయిలు చెల్లించేదెప్పుడో..?

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

గిరిజనులు, దళితులు, దివ్యాంగులైన యువకులు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వశక్తితో జీవించేందుకు ప్రభుత్వం టీ-ప్రైడ్(తెలంగాణ-నూతన పారిశ్రామిక పెట్టుబడి ప్రోత్సాహక పథకం) ప్రారంభించింది. ఇందులో భాగంగా పురుషులకు 35 శాతం, మహిళలకు 45 శాతం రాయితీపై కార్లు మంజూరు చేసి ప్రధాన పట్టణాల్లో నడుపుకోవడానికి అవకాశం కల్పించారు. తొలినాళ్లలో ప్రభుత్వం నాలుగేళ్లపాటు ఆరునెలలకు ఒకసారి నిధులు విడుదల చేసింది. ఆ తర్వాత నిధుల విడుదలకు బ్రేక్ పడింది.

ఇదీ పరిస్థితి..

దివ్యాంగులకు పదేళ్ల నుంచి, మిగతా వారికి ఐదేళ్లుగా రాయితీ డబ్బులు విడుదల చేయడంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోంది. గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో ఇప్పటివరకు 1349 యూనిట్లకు రూ. 66.60 కోట్ల బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిలో సగం మందికి మాత్రమే రాయితీలు వచ్చాయి. దీంతో యువత వాహనాల కొనుగోలుకు ముందుకురావడం లేదు. ఇక దివ్యాంగుల రాయితీలు 2016 నుంచి అలాగే ఉన్నాయి. మరోవైపు ఈ పథకంలో వాహనాలు కొనుగోలు చేసిన యువతకు స్థానిక కార్యాలయాల్లో వాటిని అద్దెకు పెట్టుకోవడానికి అవకాశం కల్పించాలి. కానీ, జిల్లాలో చాలా మంది అధికారులు వారి సొంత వాహనాలను అద్దెకు పెట్టుకుని బిల్లులు తీసుకుంటూ నిరుద్యోగులైన యువతకు అవకాశం కల్పించడం లేదు. ఇప్పటికైనా రాయితీ విడుదల చేయాలని, స్థానిక కార్యాలయాల్లో వాహనాలు అద్దెకు పెట్టుకునేందుకు లబ్ధిదారులకు అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. రాయితీ నిలిచిపోయిన మాట వాస్తవమని, ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయగానే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని కామారెడ్డి పరిశ్రమలశాఖ జీఎం తులసీదాస్ తెలిపారు.

జిల్లా వివరాలు ఇలా..

విభాగం	ఎప్పటి నుంచి	యూనిట్లు	బకాయిలు(రూ.లలో)
దివ్యాంగులు	2016	90	4,58,37,597
ఎస్సీలు	2020	426	22,04,38,993
ఎస్టీలు	2020	833	39,97,37,765

పిల్లలకు గంటైనా కేటాయిస్తున్నారా..?

న్యూస్‌టుడే, నిజామాబాద్ విద్యావిభాగం

☛ జిల్లాలోని ఒక మండల కేంద్రంలో నున్న గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మార్చి 3న జరిగింది. అంతకు ముందు రెండు రోజుల కిందట తనను చూసేందుకు రావాలని ఆ విద్యార్థి తన తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. కొన్ని పనులు చూసుకుని తర్వాత వస్తామని వారు సముదాయించారు. కనీసం కోరిన వెంటనే వెళ్లినా కొడుకు దక్కేవాడేమో అని ఆ కన్నవాళ్లు ఇప్పుడు పుత్రశోకాన్ని అనుభవిస్తున్నారు.

☛ ఇందల్‌వాయి మండలంలోని ఓ గ్రామానికి చెందిన విద్యార్థి నిజామాబాద్‌లోని ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రోజూ బస్సులో ఉదయం 7 గంటలకు బడికి వెళ్లడం, సాయంత్రం మళ్లీ అదే వేళకు ఇంటికి రావడం దినచర్యగా మారింది. హోంవర్క్ చేసి, భోజనం తిన్నవెంటనే నిద్రకు ఉపక్రమిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో అనుబంధం తగ్గిపోయి.. ఇప్పుడు అతడు ఒంటరితనానికి లోనవుతున్నాడు. తల్లిదండ్రుల మాట వినకుండా మరింత మొండిగా తయారయ్యాడు.

☛ తల్లిదండ్రుల నిర్లక్ష్యంతో పిల్లల్లో పెరుగుతున్న ఒంటరితనం

తల్లిదండ్రులకు పిల్లలతో కాసింతైనా సమయం గడిపేందుకు తీరిక లేకుండా పోతోంది. ఫలితంగా నేటి బాలలు, ముఖ్యంగా టీనేజర్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. హాస్టళ్లలో కుటుంబానికి దూరంగా ఉండే వారిలో ఒంటరితనం పెరుగుతోంది. ఇల్లు, కుటుంబంపై బెంగతో నాలుగు గోడల మధ్య మనోవేదన అనుభవిస్తున్నారు. ఇటు ఇంట్లో ఉంటున్నా ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు కుటుంబ సభ్యుల మధ్య అడ్డుగా డిజిటల్ గోడలను కట్టేశాయి. తల్లిదండ్రులతో పిల్లల మధ్య దూరం పెరగడం తీవ్ర నేరాలకూ దారి తీస్తోందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గంజాయి, జల్సాలకు అలవాటైన పదోతరగతి విద్యార్థులు ఇటీవల నల్గొండ జిల్లాలో ప్రిన్సిపల్‌ను హత మార్చడం నేటి సమాజ పోకడలకు అద్దం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోనూ బాలల్లో నేర ప్రవృత్తి ప్రబలుతోంది. గతంలో జిల్లా కేంద్రంలోని బాలల సదన్‌లోని బాల నేరస్థుల సంఖ్య అయిదులోపు ఉండేది. ఇప్పుడా సంఖ్య 20కి పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

అలా చేస్తే ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది..

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితాన్ని కాస్త పక్కనపెట్టి.. తల్లిదండ్రులు రోజూ కనీసం గంట పాటు పిల్లలతో గడపాలి. వారితో ఆడుకోవాలి. ఆ రోజు ఎలా గడిచిందని తెలుసుకోవాలి. సమస్యలుంటే పరిష్కరించే ప్రయత్నం చేయాలి. అలాకాకుండా విసుక్కుంటే పిల్లల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. **- డా.విశాల్, న్యూరో సైకియాట్రిస్ట్, జీజీహెచ్**

జిల్లాలో విద్యార్థులు..
పాఠశాల స్థాయి: 2,94,290
ఇంటర్‌లో.. 36,963

బాలలపై గంజాయి పడగ.. అక్రమార్కులకు పండుగ

☛ జులై 9న బీర్కూర్ రెండు పడక గదుల ఇళ్ల కాలనీ వద్ద అర్ధరాత్రి గంజాయి తాగుతున్న ఇద్దరు మైనర్లను పోలీసులు పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. జులై 10న తిమ్మాపూర్ శివారు మినీ ట్యాంకు బండ్ వద్ద గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అర్ధరాత్రి గంజాయి తాగుతుండగా పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు.

☛ బాన్సువాడకు చెందిన ఓ విద్యార్థి రోజూ బడి విరామ సమయంలో టీ దుకాణంలో కనిపిస్తుంటాడని అతని తండ్రికి తెలిసింది. సదరు విద్యార్థి అక్కడ ఏం చేస్తున్నాడు అని విచారించగా.. సిగరెట్ తాగుతున్నట్లు గుర్తించారు.

☛ పిట్లం నుంచి నిజామాబాద్‌కు గంజాయి తరలిస్తున్న వాహనాన్ని వర్ని మండలం మల్లారం సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. సుమారు రూ.2 లక్షల విలువైన నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన 15 రోజుల కిందట జరిగింది. ఈ ఘటనల ద్వారా జిల్లాతో పాటు బాన్సువాడ డివిజన్‌లో మత్తు పదార్థాల విక్రయం, వినియోగం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

మత్తుపదార్థాల రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నా గ్రామాల నుంచి పట్టణాల వరకు వాటి క్రయవిక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాటికి విద్యార్థులు బానిస అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బాన్సువాడ పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా అవుతోంది. బాన్సువాడలోని బస్టాండ్, తాడ్కోల్ చౌరస్తాలతో పాటు టీ దుకాణాల్లో కొందరు వ్యక్తులు గంజాయి సిగరెట్లు విక్రయిస్తున్నారు. ఒక్క సిగరెట్‌ను రూ.70 నుంచి రూ.100 వరకు అమ్ముతూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

ఆరోగ్యం, భవిష్యత్తు ప్రశ్నార్థకం..

కొందరు పట్టణాలు, మండల కేంద్రాలకు దూరంగా టీ దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా క్యాబిన్లు ఉండటంతో విద్యార్థులు అక్కడికి వెళ్లి సిగరెట్లలో గంజాయి కలుపుకొని తాగుతున్నారు. నిబంధనల ప్రకారం మైనర్లకు సిగరెట్లు విక్రయించొద్దు. అయినా కొందరు పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అమ్ముతున్నారు. చిన్న వయసులోనే మత్తుపదార్థాలకు అలవాటుపడుతున్న విద్యార్థులు తమ ఆరోగ్యం, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసుకుంటున్నారు. అధికారులు గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై బాన్సువాడ సీఐ శ్రీధర్ మాట్లాడుతూ.. 'మైనర్‌లకు సిగరెట్లు విక్రయించొద్దు. టీ దుకాణాలపై నిఘా పెట్టాం. గంజాయి సిగరెట్లు అమ్ముతున్న వారిపై ప్రత్యేకంగా దృష్టిసారించి చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

– న్యూస్‌టుడే, బాన్సువాడ, బీర్కూర్

మొరం తవ్వకాల అడ్డగింత

అటవీశాఖ అధికారులతో అక్రమార్కుల వాగ్వాదం

ఈనాడు డిజిటల్, కామారెడ్డి: అటవీ భూముల్లో మొరం తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన అటవీశాఖ అధికారులకు, అక్రమార్కులకు మధ్య వాగ్వాదం జరిగిన ఘటన బిచ్కుంద మండలం దడ్గి పంచాయతీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దడ్గి సమీపంలోని అటవీభూమిలో కొందరు అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేస్తున్నారనే సమాచారంతో ఆ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని మొరం తవ్వకాలు అడ్డుకున్నారు. చరవాణిలో ఫొటోలు తీశారు. దీంతో అక్రమార్కులు ఆగ్రహానికి గురై వాగ్వాదానికి దిగారు. అధికారుల సెల్‌ఫోన్లు తీసుకొని సుమారు రెండు గంటలకు పైగా గ్రామంలోనే ఉంచారు. గతంలోనూ వీరు అటవీ శాఖ అధికారులకు ఇబ్బందులు కలిగించినప్పుడు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగిందని 'ఈనాడు'తో చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని.. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని ఏఎస్సై దేవరాజు తెలిపారు.

పొదుపు నిధుల భద్రతకు ఈకేవైసీ

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

'స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)' మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను ఏటా మంజూరు చేస్తోంది. తీసుకున్న సాయంతో వ్యాపారాలు చేస్తూ పలువురు ఆర్థిక స్వావలంబన దిశగా పయనిస్తున్నారు. ఇదే సమయంలో నిధులు పక్కదారి పట్టకుండా, ఖాతా వివరాలు పారదర్శకంగా నిర్వహించేలా అందరు సభ్యులకు ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ - నో యువర్ కస్టమర్)ను తప్పనిసరి చేసింది.

నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌లో సభ్యురాలి ఈకేవైసీని చేస్తున్న వీవోఏ

ఎస్‌హెచ్‌జీ సభ్యుల వివరాలు జాతీయ స్థాయిలో అందుబాటులో ఉండేలా 'లోకోస్' యాప్‌తో సంబంధిత అధికారులు అనుసంధానం చేశారు. సంఘం సభ్యులు అర్హులా, అనర్హులా అని తెలుసుకునేందుకు ప్రతి సభ్యురాలి ఈ-కేవైసీని ప్రస్తుతం పూర్తిచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామ సంఘం అసిస్టెంట్‌లు అంతా ఈ పనిలోనే నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 శాతం లక్ష్యం నమోదు చేశారు.

☛ ఇప్పటికే అన్ని ఎస్‌హెచ్‌జీల వివరాలను 'సెర్ప్' వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. సంఘాల వారీగా సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లించిన వాయిదాలు, పొందిన వడ్డీ రాయితీ, తీసుకున్న స్త్రీనిధి రుణాలు, చేస్తున్న వ్యాపారం, పొందుతున్న లాభాలు వంటివాటిని సమగ్రంగా నమోదు చేశారు. ఈకేవైసీ కూడా పూర్తయితే పొదుపు నిధులు పక్కదారి పట్టించడం సాధ్యం కాదు. అనర్హులకూ లబ్ధి కలిగే అవకాశం లేదు.

☛ **ఆధార్ నవీకరిస్తేనే..:** ఆధార్ కార్డు నవీకరణ చేయకపోతే ఈ-కేవైసీ చేయించడం కష్టం అవుతుంది. ఫోన్ నంబరు కూడా ఆధార్‌కు అనుసంధానమై ఉండాలి. ఫొటో సైతం ఆధార్‌లో ఉన్నదాంతో సరిపోలాలి. నవీకరణ సమస్యను పరిష్కరించి, ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆదేశించారు.

వివరాలు ఇలా..

జిల్లా	మొత్తం సభ్యులు	ఈకేవైసీ చేసుకున్నవారు	శాతం
నిజామాబాద్	2,06,871	1,11,452	53.88
కామారెడ్డి	1,33,148	42,052	31.58

సభలో ప్రసంగిస్తున్న తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత : వేదికపై కంటతడి పెడుతూ..

ప్రజల కష్టాలు తీర్చాలనే పార్టీ పెట్టా : కవిత

ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్: తాను ఏ తప్పు చేయకపోయినా జైల్లో పెట్టించారంటూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీని ప్రకటించిన తర్వాత జిల్లాకు తొలిసారిగా వచ్చిన ఆమె, నిజామాబాద్ పాత కలెక్టరేట్ మైదానంలో సోమవారం జరిగిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ప్రసంగించారు. 'నేను రాజకీయం చేయాలంటే ఏ పార్టీలోకైనా వెళ్లొచ్చు. కానీ తెలంగాణ ప్రజల కష్టాలు తీర్చాలనే పంతంతో నిజామాబాద్ ఆడబిడ్డగా పార్టీ పెట్టా' అని కవిత అన్నారు. పార్టీ లక్ష్యం, పాంచజన్య అంశాలను వివరిస్తూనే భారాస, కాంగ్రెస్, భాజపాలపై విమర్శలు గుప్పించారు.

వారంతా ఒక్కటై ఓడించారు..

భారాస తరఫున ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్‌లను ఎమ్మెల్యేలుగా గెలిపించేందుకు జిల్లా అంతటా తిరిగా. ప్రశాంత్‌రెడ్డి మంత్రి కూడా అయ్యారు. వారంతా ఒక్కటై నేను ఎంపీగా గెలవకుండా చేశారు. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి అవినీతికి పాల్పడి ఆస్తులు సంపాదించుకున్నారు. తెలంగాణ రాకముందు నాకు ఫ్యాక్టరీ ఉంది. ఆ తర్వాత దాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లోనూ మా పార్టీయే గెలుస్తుంది' అని కవిత ధీమా వ్యక్తం చేశారు. సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించేందుకు పోరాటం సాగిస్తానని అన్నారు.

అంత్యక్రియలు జరిపించి.. అస్థికలు గంగలో కలిపి..

అస్థికల నిమజ్జన కార్యక్రమంలో మద్దుకూరి సాయిబాబు, సుజన్‌కుమార్, ప్రతినిధులు

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: ఎవరూ లేని అనాథల అంతిమయాత్ర గౌరవప్రదంగా సాగేలా చూస్తోంది.. 'ఇందూర్ స్వచ్ఛంద సేవా సంస్థ'. మానవతతో ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తోంది. మృతుల అస్థికలను సంప్రదాయం ప్రకారం కాశీ గంగానదిలో నిమజ్జనం చేయిస్తోంది. ఈ క్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, ఇతర ప్రతినిధులు సోమవారం కాశీలోని మణికర్ణిక ఘాట్ వద్ద 32 మంది అనాథల అస్థికలను గంగానదిలో కలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరేలా పుణ్య క్రతువులు జరిపించి, పిండ ప్రదానం చేశారు. 2015లో నిజామాబాద్ పోలీసుల సహకారంతో సంస్థ ఓ అనాథ శవానికి అంత్యక్రియలు జరిపించడం ద్వారా మానవతను చాటే క్రతువు మొదలైంది. ఇప్పటి వరకు 200 మంది భౌతికకాయాలకు అంతిమ సంస్కారాలు జరిపించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 168 మంది అస్థికలను ఒకేసారి గంగలో కలుపగా, యూవీ ఫౌండేషన్ సుజన్‌కుమార్, సంస్థ ప్రతినిధులు పసునూరి వినయ్ కుమార్, ఇందూరి శేఖర్, రాజు, వెంకట్‌గౌడ్ సహకరించారు.

పైకొచ్చిన గంగమ్మ..

☛ నెల రోజుల్లో 4.60 మీటర్లు పెరిగిన నీటిమట్టం

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

అలుగు పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు

జిల్లాలో భూగర్భ జలాలు ఉబికివచ్చాయి. జులైలో 13. 64 మీటర్లుగా ఉండగా.. ఆగస్టులో 9.04 మీటర్లకు నీటిమట్టం చేరింది. జులై చివరిలో ప్రారంభమై.. ఆగస్టులో వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. నెల వ్యవధిలో 4.60 మీటర్ల నీటిమట్టం పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో నెల రోజుల్లో వానాకాలం పూర్తికానుంది. ఈలోపు ఒకటి, రెండు భారీ వర్షాలు కురుస్తాయని రైతులు ధీమాతో ఉన్నారు. వానాకాలం పంటలకు ఢోకా లేదనే ధైర్యంతో పంటలు సాగు చేస్తున్నారు.

పొదుపు చర్యలు తప్పనిసరి..

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు ఆశించినంతగా ఉండవని వాతావరణశాఖ పేర్కొంది. అయినప్పటికీ ఇప్పటివరకు సమృద్ధిగా వర్షాలు కురవగా.. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. నీటిని చాలా పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భనీటి మట్టాలు కొన్నిచోట్ల పైకి వచ్చాయని పేర్కొంటున్నప్పటికీ.. మరికొన్నిచోట్ల ఇంకా లోతులోనే ఉన్నాయి. దోమకొండ, పిట్లం, తాడ్వాయి, బీబీపేట మండలాల్లో ఏర్పాటు చేసిన కొన్ని పీజోమీటర్లలో 18 నుంచి 22 మీటర్ల వరకు నీటి మట్టాలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 3.19 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. దీన్ని గుర్తించి బోరుబావులను అవసరం మేరకే నడిపించుకోవాలి. నీటి కుంటలను నిర్మించుకొని భూగర్భజలాల పెంపునకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

భూగర్భ జల నీటిమట్టం వివరాలు (మీటర్లలో)

మండలం	జులై	ఆగస్టు
బిచ్కుంద	5.77	0.63
నస్రుల్లాబాద్	1.80	1.52
పాల్వంచ	16.36	3.50
బాన్సువాడ	6.95	3.72
నిజాంసాగర్	7.89	3.95
సదాశివనగర్	11.50	4.67
బీర్కూర్	7.17	5.29
మాచారెడ్డి	8.07	5.39
లింగంపేట	11.82	5.71
జుక్కల్	7.06	5.79
మద్నూర్	12.48	6.04
మహమ్మద్‌నగర్	8.29	7.17
పిట్లం	8.19	7.22
రామారెడ్డి	12.46	8.05
పెద్దకొడప్‌గల్	11.79	8.40
కామారెడ్డి	12.55	9.65
తాడ్వాయి	27.46	10.53
రాజంపేట	20.00	11.02
భిక్కనూరు	15.46	11.04
ఎల్లారెడ్డి	15.60	11.16
డోంగ్లీ	12.23	12.02
గాంధారి	19.78	14.19
నాగిరెడ్డిపేట్	19.78	15.58
బీబీపేట	21.11	19.33

(c) eenadu

బిందు సేద్యం.. నిర్వహణే ప్రధానం

న్యూస్‌టుడే, బోధన్ గ్రామీణం

నీటి ఆదాతో పాటు మొక్కకు అవసరమైన మేరకే నీటి తడులు అందించే వనరు బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్). జిల్లాలో చాలా మంది రైతులు బిందుసేద్యంతో పంటలు పండిస్తున్నారు. ఆయిల్‌పామ్, మిరప, ఉద్యానతోటలకు అవసరానికి తగ్గట్టు వినియోగిస్తున్నారు. ఈ సేద్యంతో నీటి ఆదాతో పాటు కలుపు నివారణ పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చని **జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్** తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు రాయితీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్రిప్ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఇవీ సూచనలు..

అన్ని డ్రిప్‌ల నుంచి ఒకే విధంగా నీరు వస్తుందా..? లేదా..? అనేది చూడాలి. అందు కోసం పొలంలోని కొలజారు, మధ్య, చివరి భాగాల్లోని డ్రిప్ లేటరల్ సామర్థ్యమున్న పాత్రలను ఉంచి నీటిని సేకరించాలి. సబ్ మెయిన్ వద్ద ఉన్న కవాటాన్ని నియంత్రించి ప్రతి డ్రిప్ నుంచి నాలుగు లీటర్లు వచ్చే వరకు

నీటిని వదలాలి. పాత్రల్లో సేకరించిన నీటిని కొలిచి వంద మీటర్ల లేటరల్ పైపుల్లో ఉన్న డ్రిప్‌ల మధ్య నీటి విడుదల 3.6శాతం కంటే ఎక్కువ తేడా లేకుండా చూడాలి. ఎక్కువ వ్యత్యాసం ఉంటే డ్రిప్‌లను శుభ్రం చేయడం లేదా మార్చాలి. డ్రిప్‌లో ప్రధానంగా ఫిల్టర్లు, డ్రిప్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. శాండ్ (గ్రావెల్) ఫిల్టర్లలో కాలక్రమేణ మట్టి, సేంద్రియ పదార్థాలు పేరుకుపోతాయి. నీటి ప్రవాహం తగ్గి డ్రిప్‌లు మూసుకుపోతాయి. వారానికి ఒకసారి బ్యాక్‌వాష్ చేసి ఫిల్టర్లలోని మలినాలను, స్క్రీన్ ఫిల్టర్లలో పేరుకున్న మురికిని తొలగించాలి. వీటిని ప్రధాన పైపులు, సబ్ మెయిన్‌లు, లేటరల్ పైపుల్లో పేరుకుపోయే మట్టి, చెత్తను తీసేయాలి. ప్రతి వారం ఫ్లష్ వాల్ తెరిచి కొద్ది నిమిషాల నీటిని వదలాలి. నల్లని లేటరల్ చివర ఉన్న ఎండ్ క్యాప్ తీసి కూడా ఫ్లషింగ్ చేయడంతో డ్రిప్‌లు మూసుకు పోవు. పైపులకు రంధ్రాలు ఏర్పడితే గూస్‌ప్లగ్ లతో మరమ్మతులు చేయాలి. డ్రిప్‌లలో పాచి ఏర్పడి లవణాలు, కార్బోనేట్లు పేరుకుపోతే ఆమ్ల లేదా క్లోరిన్ ద్రావణంతో శుభ్రం చేయాలి. పంటకోత అనంతరం లేటరల్ పైపులను భద్రపర్చాలి.

వర్షాల వేళ పొలాల్లో యాజమాన్య పద్ధతులు

న్యూస్‌టుడే, రుద్రూర్

వర్షాలు కురిసిన సమయంలో పంటలకు ఎలాంటి రసాయనాలను పిచికారీ చేయొద్దని, ఎరువులు వేయొద్దని **రుద్రూర్ కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త ఇందూధర్‌రెడ్డి** సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత భూమిలో తేమ ఉన్నప్పుడు పంటలకు ఎరువులు వేయాలి. ఆరుతడి పంటల్లో కాల్వలు తీయడం ద్వారా నీరు నిల్వ లేకుండా చూడొచ్చు. మురుగు నీటిని ఎప్పటికప్పుడు పొలం నుంచి తీసేయాలి. వర్షాలతో కలుపు మొక్కలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది కాబట్టి గొర్రుతో అంతర కృషి తప్పనిసరిగా చేయాలి. పత్తి, సోయాబిక్కుడు పంటల్లో రసం పీల్చే పురుగులు వర్షాల తర్వాత 90% ఆశించే ఆస్కారం ఉంటుంది. ఈ సమయంలో ఎలాంటి రసాయనాలు పిచికారీ చేయొద్దు. వర్షాల సమయంలో పొలాలలో ప్రవహించే నీటిని కుంటల్లో మళ్లించి నిల్వ చేసుకోవడంతో పాటు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆ నీటిని వినియోగించుకునే వీలుంటుంది. ఇంకుడు గుంతల తోనూ భూగర్భ జలాలను వృద్ధి చేయొచ్చు. ఈ నేపథ్యంలో రైతులు తమ పొలాల్లో ఇంకుడు గుంతలు, నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలి.

సోయాబీన్‌లో సస్యరక్షణ చర్యలు

న్యూస్‌టుడే, వర్ని : ఆలస్యంగా విత్తిన సోయాబీన్‌ను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ.. అవసరమైన సమయంలో సిఫార్సు చేసిన మందులను వినియోగిస్తే పంటను చీడపీడలు, తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని **రుద్రూర్ చెరకు, వరి ప్రాంతీయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త రాకేష్** సూచించారు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే పెట్టుబడి తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ మేరకు కలుపు, చీడపీడల నివారణ గురించి వివరించారు.

● **కలుపు నివారణ :** విత్తిన మొదటి 45 రోజులు కలుపు నివారణకు కీలకం. ఈ సమయంలో నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు ఎకరానికి ఇమాజిథాఫిర్ 10శాతం ఈ.సి 300 మి.లీలు లేదా ఇమాజిథాఫిర్ + ఇమాజమాక్స్ 40గ్రా, ప్రొపాక్విజాఫాప్ + ఇమాజిథాఫిర్ 800 మి.లీ కలిపి కలుపు మందులను పిచికారీ చేయాలి. 40 రోజుల తర్వాత కలుపు మందుల వినియోగం ఆశించిన ఫలితం ఇవ్వదు. ఆలస్యంగా విత్తిన పంటలో 30-35 రోజుల సమయంలో 25-30 కిలోల యూరియాను పైపాటుగా వేసి మట్టితో కప్పాలి. బెట్ట పరిస్థితుల్లో సున్నిత, పుష్పించే దశలో 12-15 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి.

● **చీడపీడలు :** ఆలస్యంగా విత్తిన పంటలో నీటి ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. తెల్లదోమ పర్యవేక్షణ, నియంత్రణకు ఎకరానికి పది పసుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలి. అవసరమైనప్పుడు ఎసిటామిప్రిడ్ 20శాతం ఎస్.పి. లేదా డయాపెంద్యూరాన్ 50శాతం డబ్ల్యూపీ సూచించిన మోతాదులో చల్లాలి. బెట్ట పరిస్థితుల్లో సింథటిక్ పెరిత్రాయిడ్ మందులను ఉపయోగించొద్దు. పూతదశ నుంచి ఆంత్రాక్నోస్, ఆకుమచ్చ, కాయకుళ్లు, బొగ్గుతెగులు, రైజోక్టోనియా వేరుకుళ్లు వంటివి ఆశించే అవకాశం ఉంది. వీటిని ప్రారంభదశలోనే గుర్తించి టెబుకొనజోల్ లేదా మాంకోజెట్+కార్బండజిమ్ వంటివి సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేయాలి.

పత్తిలో ఇలా..

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి : వర్షాల కారణంగా పత్తిని తెగుళ్ల, చీడపీడలు ఆశించే అవకాశం ఉందని, రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎల్లారెడ్డి ఏడీఏ సుధామాధురి తెలిపారు. ప్రధానంగా ఆకులు ఎర్రబడటం, పెరుగుదల లేకపోవడం, రసంపీల్చే పురుగులతో పాటు వివిధ తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోషకాలు అందించడానికి పైపాటుగా 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్ 13-0-45 లేదా 10గ్రా యూరియాను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. భూమి ద్వారా పోషకాలు ఇస్తూ ఉండాలి. పైపాటుగా 20రోజులకు ఒకసారి దాదాపు 80 రోజుల వరకు ఎకరానికి 25కిలోల యూరియా, 10కిలోల పొటాష్ కలిపి మొక్కకు దగ్గరగా పడేలాగా వేయాలి. అధిక వర్షాలతో మొక్కలు వాడిపోవడం గమనిస్తే లీటరు నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 3గ్రా లేదా కార్బండిజమ్ 1గ్రా కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పేనుబంక, పచ్చదోమ వంటి రసం పీల్చే పురుగుల నివారణకు మోనోక్రోటోఫాస్, నీరు 1:4 నిష్పత్తిలో లేదా ఫ్లోనికామిడ్, నీరు 1:20 నిష్పత్తిలో 30, 45, 60 రోజుల్లో అందించాలి. దీంతో రసం పీల్చే పురుగులను సమర్థంగా అరికట్టవచ్చు. తామర పురుగుల నివారణకు లీటరు నీటికి 2మి.లీ పిప్రోనిల్ లేదా 0.2గ్రా థయోమిథాక్సామ్ లేదా 0.3గ్రా ఫ్లోనికామిడ్‌ను పిచికారీ చేయాలి.

భవనాలు శిథిలం.. సేవలకు కష్టం

ఇదీ బల్దియా, దవాఖానా భవనాల పరిస్థితి

న్యూస్‌టుడే, బోధన్ పురపాలిక

ప్రజలకు నిత్యం సేవలందించే బోధన్ ప్రభుత్వ జిల్లా దవాఖానా, బల్దియా కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించారు. ప్రస్తుతం వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారడంతో పాటు పెచ్చులు ఊడిపడటంతో అధికారులు, సిబ్బంది, వైద్యులు, రోగులు, కార్యాలయానికి వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిస్తే ఈ భవనాల్లో విధులు నిర్వర్తించడం, సేవలు అందించడం కష్టంగా మారుతోంది.

సరైన రక్షణ కరవు..

గత మూడేళ్లుగా వర్షం పడిన ప్రతిసారీ బోధన్ బల్దియా కార్యాలయంలో పైకప్పు నుంచి నీరు కారుతోంది. ప్రధాన ద్వారం నుంచి పలు విభాగాల వరకు వర్షపు నీరు చేరుతోంది. నీటిని పట్టేందుకు ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. కంప్యూటర్లు, దస్త్రాలు తడవకుండా ప్లాస్టిక్ కవర్లు, ఫ్లెక్సీలతో కప్పి ఉంచుతున్నారు. దీంతో విలువైన సామగ్రి, దస్త్రాలకు సరైన రక్షణ లేకుండా పోతుంది. వర్షాకాలంలో అధికారులు, సిబ్బందితో పాటు వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

బోధన్ ప్రభుత్వ జిల్లా దవాఖానా పైఅంతస్తులో శిథిలావస్థకు చేరిన వార్డును మూసివేశారిలా...

ఇన్‌పేషెంట్ వార్డు మూసివేత..

బోధన్ ప్రభుత్వ జిల్లా దవాఖానాకు సుమారు నిత్యం సుమారు 400 మంది వరకు రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. 50 మందికి పైగా రోగులు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుంటారు. దవాఖానా పైఅంతస్తులోని ఇన్‌పేషెంట్ వార్డు గది పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో రెండేళ్ల కిందట దానిని మూసివేశారు. ఇతర వార్డులు సైతం వర్షాలకు ఉరుస్తున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గదుల్లోనే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. కాలానుగుణ వ్యాధుల కారణంగా రోగుల సంఖ్య పెరగడంతో సరిపడా గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అధికారులు ఏమన్నారంటే..

ఈ విషయమై జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డా.శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ.. దవాఖానా మరమ్మతులకు రూ.66లక్షలతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. నిధులు మంజూరైతే మరమ్మతులు చేపట్టే అవకాశం ఉందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడుతూ.. బోధన్ బల్దియా నూతన కార్యాలయ నిర్మాణానికి రూ.5 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపామని పేర్కొన్నారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, వేదికపై డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, రూరల్-అర్బన్ సర్ పరిశీలకుడు రాఘవరెడ్డి

'ప్రతి ఓటు కాపాడే బాధ్యత నాయకులదే'

డిచ్‌పల్లి, న్యూస్‌టుడే: సర్ నోటీసులు వచ్చిన ప్రతి వ్యక్తి ఓటును కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని, బూత్‌స్థాయి ఏజెంట్లు ఆ దిశగా పనిచేయాలని ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి పేర్కొన్నారు. డిచ్‌పల్లిలో సోమవారం సర్ నియోజకవర్గ సదస్సుకు డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, రూరల్-అర్బన్ పరిశీలకుడు రాఘవరెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. చిన్నచిన్న కారణాలతో వేలాది ఓటర్లకు నోటీసులు జారీ అయినట్లు తెలిపారు. ప్రతి నోటీసుకు సరైన ఆధారాలతో సమాధానం ఇవ్వాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. 1000 రోజుల ప్రజాపాలనలో పేదల అభ్యున్నతికి సర్కారు కృషి చేసిందన్నారు. పరిశీలకుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ.. సర్వేపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, గంగాధర్, శ్రీనివాస్, అంబర్‌సింగ్, సాయారెడ్డి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాప్‌లు తొలగించాలని ధర్నా

ఇందల్‌వాయి : రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన ఎరువుల యాప్‌లతో కర్షకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని తక్షణమే తొలగించి పాత విధానంలోనే ఎరువులు పంపిణీ చేయాలని అన్నదాతలు ధర్నా చేశారు. ఇందల్‌వాయి సొసైటీలో సోమవారం 900 బస్తాల యూరియా కేవలం అప్‌లోడ్ చేసిన రెండు నిమిషాల వ్యవధిలోనే అయిపోయాయని, ఇలాగైతే రైతులు సాగు వదులుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు అత్యవసరమైన సమయంలో యూరియా దొరకడం లేదని పేర్కొన్నారు. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి యాప్‌లో పంపిణీ తొలగించాలన్నారు.

సొసైటీ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

2024 బీఈడీ ఫలితాలు విడుదల

తెలంగాణ విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయం 2024 బ్యాచ్ బీఈడీ కోర్సు ఫలితాలను రిజిస్ట్రార్ యాదగిరి, సీఈవో సంపత్‌కుమార్, అదనపు కంట్రోలర్ శాంత సోమవారం విడుదల చేశారు. 1354 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 1288 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వారు పేర్కొన్నారు. 95.12 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

నిలకడగా నీటిమట్టం

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి కేవలం 2315 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నీటిమట్టం గత కొన్ని రోజులుగా నిలకడగా ఉంటోంది. పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా సోమవారం సాయంత్రం వరకు జలాశయంలో 1079.90 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సోమవారం ఉదయం ఆరు గంటల వరకు ఎగువ నుంచి 35.478 టీఎంసీల నీరు చేరింది. కాకతీయ కాల్వ ద్వారా 250, మిషన్‌భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల జరుగుతోంది. 482 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో తగ్గుతోంది.

ఎస్సారెస్పీలో నిల్వ ఉన్న నీరు

నిర్ణయం తీసుకోలేదు..

ఈ ఏడాది వానాకాలం పంటలకు నీటి విడుదలపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నీటిని విడుదల చేయాలంటే ప్రాజెక్టులో కనీసం 55 టీఎంసీలు ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 44.713 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భారీ వర్షాలు కురిస్తేనే వరద పెరిగే అవకాశం ఉంటుంది. కానీ ఎల్‌నినో ప్రభావంతో వరణుడు కరుణించడం లేదు. ప్రాజెక్టు ద్వారా నీటిని ఎప్పుడు విడుదల చేస్తారా అని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు.

పుర కమిషనర్ పర్వతాలుకు వినతిపత్రం ఇస్తున్న భాజపా కౌన్సిలర్లు

'తీర్మానాలు రద్దు చేయాలని డిమాండ్'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఆగస్టు 29న జరిగిన పురపాలక పాలకవర్గ సమావేశంలో అత్యవసరంగా కొన్ని అంశాలు చేర్చి ఆమోదించిన తీర్మానాలను రద్దు చేయాలని భాజపా కౌన్సిలర్లు కమిషనర్ పర్వతాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ మోటూరి శ్రీకాంత్ మాట్లాడారు. సభ జరిగే కంటే ముందు ప్రత్యేకంగా అంశాలను అజెండాలో చేర్చి ఆమోదించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో అధికారులు తగిన న్యాయం చేయాలన్నారు.

బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాలస్వామి

సిద్దిపేట అర్బన్ : తెలంగాణ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గోపాలస్వామి ఎన్నికయ్యారు. సిద్దిపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర మహాసభలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమ, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, భాస్కర్, పద్మ, మోహన్, పుష్ప, చౌదరి, కార్యదర్శులుగా శోభ, సత్యం, రాజు, సులోచన, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అంజయ్య, భాస్కర్, శ్యామల, లావణ్య, లహరి, గణేశ్ ఎన్నికయ్యారు.

రైల్వే డబ్లింగ్ పనులపై సమీక్ష

నిజామాబాద్ కలెక్టరేట్ : ముద్కేడ్ - మేడ్చల్ రైల్వే డబ్లింగ్ పనులకు సంబంధించిన భూసేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని ఇన్‌ఛార్జి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని వివరించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

వీసీలో పాల్గొన్న ఇన్‌ఛార్జి కలెక్టర్ భవేశ్‌మిశ్రా, అధికారులు

ఆటో, బైక్ - ఢీ.. ఇద్దరి పరిస్థితి విషమం

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: మండలంలోని బంజారా తండా వద్ద జాతీయ రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లింగంపేట్ మండలం ఎక్కపల్లి గ్రామానికి చెందిన వ్యక్తులు ఆటోలో బంజారా తండా వద్ద ఉన్న బంధువుల ఇంటికి వస్తున్నారు. రాజంపేట్ మండలం గుడితండాకు చెందిన చోక్లా తన బైక్‌పై ఎల్లారెడ్డి నుంచి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యలో బంజారా తండా వద్ద ఆటో-బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సక్రాంతో పాటు, ఆటోలో ప్రయాణిస్తున్న అఖిల్, కమ్లి, శాంతి, లక్ష్మీలు గాయపడగా.. రవీందర్, నాన్వీష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఆసుపత్రికి తరలించారు. మరికొందరు మండల కేంద్రంలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

రూ.10 నోటు ఇచ్చి.. రూ.20వేల అపహరణ

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లా పోచమ్మరాల్ తండాకు చెందిన **మూడ్ కేస్లీ** తన భర్త దస్రియ్యతో కలిసి సోమవారం గోపాల్‌పేట్ వచ్చింది. స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లే సమయంలో స్కూటర్‌పై వచ్చిన వ్యక్తులు దంపతులను కలిశారు. రూ.పది నోటు ఇచ్చి దాన్ని నలిపి వాసన చూడమని చెప్పారు. దంపతులు అలా చేయగానే వారు మత్తులోకి జారుకున్నారు. వెంటనే ఆ వ్యక్తులు కేస్లీ వద్ద ఉన్న రూ.20వేల నగదు, 12 తులాల వెండి గొలుసును అపహరించి వాహనంపై వెళ్లిపోయారు. కొంతసేపటికి తేరుకున్న దంపతులు స్థానికుల సాయంతో పోలీసులను ఆశ్రయించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవీపేట, న్యూస్‌టుడే : వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు నవీపేట ఎస్సై శ్రీకాంత్, పౌరసరఫరాలశాఖ ఉప తహసీల్దారు పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. వారి కథనం ప్రకారం.. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన అర్బాద్ అనే వ్యక్తి ఆర్మూర్ నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు వ్యాన్‌లో 127.80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా.. ఫకీరాబాద్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. డీటీ పవన్‌కుమార్ ఫిర్యాదు ఇచ్చిన మేరకు వాహన యజమానితో పాటు డ్రైవర్ అర్బాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నేత్ర పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో 175 మందికి కంటి పరీక్షలు చేసి 113 మందికి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్, నేత్ర వైద్యులు రవీందర్, శ్రీహరి కిషన్, వైద్యులు మారుతిబాబు, సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట్

'ఉద్యోగులు నిరసనల్లో పాల్గొనాలి'

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐకాస పిలుపు మేరకు మంగళవారం ఉద్యోగులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల ఐకాస జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఆయా మండల కేంద్రాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ బాబు, పంపరి ప్రవీణ్‌కుమార్, మఖ్బుల్, బషీర్, నాగరాజు, సాయిరెడ్డి, రాములు, సయ్యద్ ఖలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి

బాధ్యతలు స్వీకరించిన సీనియర్ సివిల్ జడ్జిలు

నిజామాబాద్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సీనియర్ సివిల్ జడ్జి పదోన్నతి పొందిన ముగ్గురు న్యాయమూర్తులు నూతన స్థానాల్లో సోమవారం బాధ్యతలు చేపట్టారు. వీరిలో నిజామాబాద్ సీనియర్ సివిల్‌జడ్జి అజయ్ ఉల్లమ్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి చైతన్య, న్యాయసేవా సంస్థ కార్యదర్శి ముద్దసాని నీలిమ ఉన్నారు. వీరు ఆర్మూర్ సీనియర్ సివిల్‌జడ్జి శ్రీదేవి నుంచి బాధ్యతలను స్వీకరించారు.

ఘనంగా తీజ్-గౌరీ మాత వేడుకలు

గాంధారి, న్యూస్‌టుడే : గాంధారి మండలంలోని చద్మల్, నేరల్, గుర్జాల్, కాయితి తండాల్లో లాభానా సమాజ్ ఆధ్వర్యంలో తీజ్-గౌరీ మాత వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. బంకమట్టి, కర్రలతో ప్రత్యేకంగా తీజ్ దేవతా విగ్రహాలను తయారు చేశారు. పెళ్లికాని యువతులు ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి 'స్వాలీ-లాఫ్సీ (పోలేలు సీరా) నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. పురుషులు వలయాకారంలో తీజ్ మాత విగ్రహాల చుట్టూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు పండాలని తీజ్-గౌరీ మాతను కొలుస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తండా పెద్దలు తాన్‌సింగ్, గంగాధర్, అమర్‌సింగ్, జగదీష్, బంతిలాల్, గంగాధర్, గణేష్, చందానాయక్, భజన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకంగా అలంకరించిన తీజ్-గౌరీ మాత విగ్రహాలు

ఒకరి మృతికి కారణమైన.. ముగ్గురికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష

నిజామాబాద్ న్యాయవిభాగం న్యూస్‌టుడే: సారంగాపూర్‌కు చెందిన చాంద్కే మాధవ్ మృతికి కారకులైన బింగెవార్ రాజమణి, ఆమె కుమారుడు రాజు, తమ్ముడు మాధవ్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి హరీష సోమవారం తీర్పుచెప్పారు. మహారాష్ట్రకు చెందిన హమాలీ మాధవ్ తల్లి తారాబాయితో కలిసి సారంగాపూర్‌లో ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన రాజమణితో మాట్లాడొద్దని తల్లికి సూచించాడు. అది తెలిసిన రాజమణి 2022, ఏప్రిల్ 26వ తేదీన హోటల్‌లో టిఫిన్ చేస్తున్న చాంద్కే మాధవ్‌పై కుమారుడు రాజు, తమ్ముడు మాధవ్‌తో కలిసి దాడిచేసింది. స్పృహ కోల్పోయిన బాధితుడిని తల్లి వచ్చి పరిశీలించగా అప్పటికే అతడు చనిపోయాడు. ఆమె ఫిర్యాదుతో నిజామాబాద్ ఆరో ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి వారికి జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. పోలీసుల తరఫున కేసును అదనపు కోర్టు పీపీ నర్సింహారెడ్డి వాదించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

మా యొక్క రిజిష్టర్ చిట్‌ఫండ్స్ ప్రై.లి. వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి ఫైనాన్షియర్స్/ పెట్టుబడి దారులు (ఫుల్ సెక్యూరిటీ) కావలెను. M/s యోజన రూరల్ చిట్‌ఫండ్ ప్రై.లి. 4-542-543, 544 శ్రీ రాజరాజేశ్వరి నగర్, కొండాపూర్, శేర్‌లింగంపల్లి, Hyd- 500084. 96036 74849. ఏజెంట్స్ కావలెను.

COMPUTER EDUCATION

Satyam Computers Super Bumper Free Offers (1+1/ 1+2/1+3) Computer Courses Free Offers) PGDCA, Data Entry, Tally, Python, HTML, Jawa, Hardware, DTP. Last Date:2/9/2026, Contact: Satyam Computers, NZB. Cell: 8688815224.

To Book Your Classified Advertisements Please Call: 8008709960 ★ GST వర్తించును.

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS

CHANGE OF NAME

I, Chekula Maladry (Old name) R/o.5-8-567/1, Ashok Nagar Colony, Kamareddy Town & Dist. TG, Holder of Passport S9681656 have changed my name as Chikula Malyadri (New name) S/o. Chekula Mala kondal.

JOBS

లక్ష్మీ TVS వినాయక్‌నగర్, NZB షోరూంలో సేల్స్ మేనేజర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), సర్వీస్ మేనేజర్స్, సర్వీస్ అడ్వైజర్స్, అకౌంటెంట్స్, టెలికాలర్స్ (F), కంప్యూటర్ ఆపరేటర్, మెకానిక్స్, వాషింగ్‌బాయ్స్ కావలెను. సాలరీ+ఇన్సెంటివ్స్. 9704204164

శ్రీరామ్ అకాడమీకి ఇంటి వద్ద నుండి ప్రాజెక్టు వర్క్ చేయుటకు ఫోన్ ఉన్న వారు కావలెను. అ:10th, జీ:20k, శిక్షణ రుసుము కలదు. Cell: 8886160671.

Raghava Asset Finance లో బోధన్, నిజామాబాద్, బాన్సువాడ, గాంధారి, కామారెడ్డి ఏరియాలో Business Executive కావలెను. Phone No.: 7337558715, 9100902175.

MARKETING/ SALES

AUM-369 డైమండ్ జ్యూవెల్లరీ నిజామాబాద్‌లో (గంగాస్థాన్ & కుమార్‌గల్లీ) మరియు ఆర్మూర్, కామారెడ్డి షోరూంలో మేనేజర్, సేల్స్‌గర్ల్స్ ... 8143403764.

విజయ్ ఇండస్ట్రీ శ్రీరక్షా హోమ్ సేఫ్ లాకర్స్ పెర్కిట్ మండలం ఆర్మూర్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారు Male మరియు Female కావలెను. సాలరీ+ఇన్సెంటివ్ ఇవ్వబడును. Conact: మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ ఇండస్ట్రీ, గట్లా ప్రవీణ్. 9848584077.

FACULTY/ TEACHERS

WANTED
Wanted Lecturers for Intermediate Courses in English, Chemistry, Physics, Botany & Zoology to teach in English Medium to Women's College, Kanteshwar, Nizamabad preferably Female Candidate with aggregate marks of 55% in Post Graduation. Submit resumes with Qualification certificates from 02.09.2026 to 05.09.2026.
✆: 9959908980, 7780342171

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ...

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
నిజామాబాద్: 8008709960, 8008709958, 9963849825
బోధన్: 8008709960 ఆర్మూర్: 8008553004
కామారెడ్డి : 8977792553, బాన్సువాడ : 8008709959
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11479

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242

ఎల్లారెడ్డి 94410 27839

జుక్కల్ 94924 00777

→ **స్పందన :** బాన్సువాడ సిద్ధి గల్లీలోని మురుగు కాల్వల్లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో దుర్వాసన వస్తుందని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు వద్ద ప్రస్తావించగా ఆయన సిబ్బందితో చెత్త నిల్వలు తొలగింపజేసి సమస్య పరిష్కరించారు.

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

→ బాన్సువాడ కోటగల్లీలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ ఇబ్బందిగా ఉందని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని వీధి దీపాల పర్యవేక్షకుడు సాయికిరణ్ వద్ద ప్రస్తావించగా ఆయన సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

→ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 15, 16 వార్డుల్లో చెత్త తీయడం లేదని నరేష్, వినోద్ తెలపగా.. పారిశుద్ధ్య బాధ్యుడు ప్రశాంత్ స్పందించి చెత్త తీయించారు.

→ కామారెడ్డిలోని 4వ వార్డులో కాల్వ పూడిక తీయడం లేదని జ్యోతి తెలపగా.. పారిశుద్ధ్య బాధ్యుడు ప్రశాంత్ స్పందించారు. కాల్వ పూడిక తీయించి సమస్య పరిష్కరించారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

→ అల్మాజీపూర్‌లో మురుగు కాల్వలు పూడిక తీయడం లేదు. దుర్వాసన వస్తోందని రాజయ్య తెలపగా గ్రామ కార్యదర్శి వినోద స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టారు.

– న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

ప్రజావాణికి 67 అర్జీలు

సమస్య వింటున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజావాణికి సోమవారం 67అర్జీలు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు తమ,తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులను వేడుకున్నారు. అదనపు కలెక్టర్లు విక్టర్, గిరి, జడ్పీ సీఈవో చందర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజలు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కొందరు బాధితులు న్యూస్‌టుడేకు గోడు చెప్పుకున్నారు.

నిషేధిత జాబితాలో చేర్చారు..

- నమేవార్ సంగ్రామ్, సిర్పూర్(దోంగ్లి)

నా పట్టా భూమిని 22(ఏ)లో చేర్చారు. 1990-91 నుంచి 2.31 ఎకరాల పట్టా భూమి ఉండేది. ఇందులో రెండెకరాలకు పైగా మా సోదరుల మధ్య వివాదం కొనసాగుతోంది. నా పేరిట మొన్నటి వరకు 16 గుంటలు ఉండేది. ఇటీవల భూమిని మార్ట్‌గేజ్ చేయిద్దామని వెళ్లాను. అప్పుడు అధికారులు పరిశీలన చేసి ఈ భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని చెప్పారు. యంత్రాంగం స్పందించి నా భూమిని పట్టాలో నమోదు చేయాలి.

వినికిడి యంత్రం కావాలి

- శేషప్ప, మిషన్ కల్లాలి(బిచ్కుంద)

నాకు చెవుడు ఉంది. వినికిడి యంత్రం మంజూరు చేయాలని కోరుతున్నాను. గతంలో చాలా మందికి ఈ యంత్రాలను సర్కారు ఇచ్చింది. ఈ యంత్రం లేకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా మారింది.

మీ-సేవలో అదనపు వసూళ్లు

- పెద్ద సాయిలు, లింగాపూర్(కామారెడ్డి)

లేబర్ కార్డు నవీకరణ కోసం జిల్లా కేంద్రంలో దర్శన్ థియేటర్ సమీపంలోని మీ-సేవ కేంద్రానికి వెళ్లాను. అక్కడి నిర్వాహకులు వివరాలను తప్పుగా నమోదు చేశారు. అంతేకాకుండా రూ.60 తీసుకోవాల్సిన దానికి రూ.600 వసూలు చేశారు. వివరాలు తప్పుగా నమోదు కావడంతో కార్మికశాఖ నుంచి ప్రయోజనాలు దక్కకుండా పోయాయి. గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదు.

ఆధార్ కార్డు రావడం లేదు

- కిష్టవ్వ, పెట్‌సంగెం(గాంధారి)

నా కుమారుడు, కోడలు మృతి చెందారు. వారికి జన్మించిన మూడేళ్ల బాలుడు రియాన్స్‌ను మేమే పోషించుకుంటున్నాం. బాలుడికి ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేదు. అనేక చోట్ల తిరుగుతున్నాం. ఆధార్ కేంద్రాల నిర్వాహకులు పని కాదని చెబుతున్నారు. అధికారులు స్పందించి నా మనుమడికి ఆధార్ కార్డు ఇప్పించాలని కోరుతున్నాను.

ఉన్నత విద్యను ఉచితంగా అందించాలి

ఎల్లారెడ్డిలో విద్యార్థుల నిరసన

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఫీజు రీయింబర్స్ మెంటు పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం నిరసన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చరణ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఉన్నత విద్యను అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి యత్నం చేయగా సీఐ రాజారెడ్డి, ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కౌశిక్, వెంకట్, రాజశేఖర్, రాజు, భరత్, అల్తాఫ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గంపకు నోటీసులు

భిక్కనూరు, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు ఎన్నికల అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఆయన స్వగ్రామం భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో గంప గోవర్ధన్ ఓటు హక్కు కలిగి ఉన్నారు. 2002 సంవత్సరానికి ముందు మాజీ ఎమ్మెల్యే తండ్రి పేరు వెంకయ్య ఉండగా.. ఇటీవల నమోదు చేసిన వివరాల్లో వెంకయ్య పేరుతో పాటు ఇంటి పేరు గంప అని నమోదు చేయడంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశమైంది.

'పేదల అభ్యున్నతికి సర్కారు కృషి'

స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్న పురపాలక ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ సర్కారు కృషి చేస్తోందని పురపాలక ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 13వ వార్డులో స్మార్ట్ రేషన్‌కార్డులను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఈ హన్మంత్‌రావు, కౌన్సిలర్లు లలిత, బాబు, అమ్జద్, వాజిద్, బబ్లూ, జావిద్, సిద్ధిక్, నాయకులు సత్యం, భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

హిందీ సాహిత్యంలో ప్రేమ్ చంద్‌కు ప్రత్యేక స్థానం

భిక్కనూరు, న్యూస్‌టుడే: హిందీ భాషా సాహిత్యంలో ప్రేమ్ చంద్‌ది ప్రత్యేక స్థానమని జంగంపల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. హిందీ ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలో 30, 30(ఎ) పోలీసు యాక్టు అమలు

ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో ఈనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 30, 30(ఎ) పోలీసు యాక్టు అమల్లో ఉంటుందని ఎస్పీ రాజేష్‌చంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ పేరిట ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీసుల అనుమతి లేకుండా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ చెప్పారు. ప్రజాధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. ఈ మేరకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రాలు మంజూరయ్యాయి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని బిచ్కుంద, నాగిరెడ్డిపేట్, మాచారెడ్డి, డోంగ్లీ, మహమ్మద్‌నగర్, బీబీపేట మండలాల్లో కొత్త ఆధార్ కేంద్రాల ప్రతిపాదనలు పంపగా.. మంజూరైనట్లు ఈడీఎం ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'అల్లంత దూరాన.. ఆధార్ కేంద్రం' కథనానికి ఆయన స్పందించారు. అయితే ఆధార్ డిపార్ట్‌మెంట్ నుంచి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లు సరఫరా కాకపోవడంతో సేవల్లో జాప్యం జరుగుతుందని తెలిపారు. కిట్లు సరఫరా జరిగితే ఆయా మండలాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

లింగంపేట ఎంపీడీవోగా మలహరి

లింగంపేట, న్యూస్‌టుడే: లింగంపేటలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మానందరావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఎంపీవో మలహరి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ విరమణ పొందిన బ్రహ్మానందరావు, నూతన బాధ్యతలు చేపట్టిన మలహరికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ పంచాయతీకి వైకుంఠ రథం అందజేత

సర్పంచి పోచయ్యకు వైకుంఠ రథాన్ని అందజేస్తున్న బాలచంద్రం

నందివాడ(తాడ్వాయి), న్యూస్‌టుడే: మండలంలోని నందివాడ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కంకణాల బాలచంద్రం సోమవారం గ్రామ పంచాయతీకి వైకుంఠ రథాన్ని అందజేసినట్లు సర్పంచి పోచయ్య తెలిపారు. బాలచంద్రం తల్లిదండ్రులు కంకణాల పెంటయ్య- సావిత్రి, భార్య స్వాతిల జ్ఞాపకార్థం రూ. 2.70 లక్షలతో గ్రామ పంచాయతీకి వైకుంఠ రథాన్ని తయారు చేయించి అందజేశారు. దాతను పాలకవర్గం సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

నూతన సీఐకి సన్మానం

సదాశివనగర్, న్యూస్‌టుడే : సదాశివనగర్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీరయ్య సోమవారం భూంపల్లి అంబరీషుని ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేశ్వర్‌రావు, నాయకులు రమేశ్, రవీందర్‌గౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణంపై ఇరువర్గాల వాగ్వాదం

బీర్కూర్, న్యూస్‌టుడే : బరంగెడ్గి 8 వ వార్డులో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణం విషయమై సోమవారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న బాన్సువాడ పంచాయతీరాజ్‌శాఖ డీఈ శారద, ఏఈ రాకేష్ ఘటనాస్థలికి వచ్చారు. తన ఇంటి స్థలంలో డ్రైనేజీ నిర్మించేలా సర్పంచి అనిల్ గుత్తేదారును ఒత్తిడి చేశారని యజమాని గజేందర్ ఆరోపించారు. డ్రైనేజీని అన్ని చోట్లా సమాంతరంగా నిర్మించి గజేందర్ ఇంటి వద్దకు రాగానే గుత్తేదారు వంకరగా నిర్మిస్తున్నారని, సర్పంచి చెప్పారు. సర్పంచి, పలువురు వార్డు సభ్యులు పనులకు ఆటంకం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గుత్తేదారు చెప్పారు. తన ఇంటి అరుగు తొలగించి డ్రైనేజీ నిర్మించాలని సర్పంచి గుత్తేదారుకు చెప్పారని, ఈ విషయమై తాను సర్పంచిని ప్రశ్నిస్తే ఆయనతో పాటు పలువురు వార్డు సభ్యులు తనను దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గజేందర్ తెలిపారు. నిబంధనల మేరకు నిర్మించాలని డీఈ గుత్తేదారుకు సూచించారు.

పెన్షన్ డబ్బుల్లో కోత...!

సదాశివనగర్, న్యూస్‌టుడే : మోడెగాంలో పెన్షన్ డబ్బుల్లో నుంచి రూ. 16 కోత విధిస్తున్నారని సోమవారం గ్రామస్థులు బీపీఎంను నిలదీశారు.

గుంతల దారితో అవస్థలు

పాత బాన్సువాడ నుంచి వినాయక్‌నగర్ వెళ్లే దారిలో రహదారి గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదిన్నరగా రహదారి ఇలాగే ఉందని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి సీసీ రోడ్డును వెంటనే నిర్మించాలని వారు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

ఆఖరి రోజు.. అవస్థలు..!

జుక్కల్, న్యూస్‌టుడే: పెన్షన్ దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు ఆగస్టు 31 ఆఖరి రోజు . గంటల తరబడి సర్వర్ సతాయించడంతో కార్యదర్శులు అవస్థలు పడ్డారు. ఈ- పంచాయతీ ఆపరేటర్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో కార్యదర్శులు మండల పరిషత్తు కార్యాలయానికి వచ్చి కంప్యూటర్ల ముందు కూర్చున్నారు. సాంకేతిక సమస్య.. ఆపరేటర్ల కొరత కారణంగా పనులు మందకొడిగా సాగుతున్నాయని, ప్రభుత్వం గడువు పెంచితే బాగుంటుందని కార్యదర్శులు పేర్కొన్నారు.

పెన్షన్ దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ చేస్తున్న కార్యదర్శులు

ఘనంగా విముక్త జాతుల దినోత్సవం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విముక్త జాతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజలు జ్యోతిబా పులే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి నర్సయ్య, ఏబీసీడీవో చక్రధర్, నాయకులు శివరాములు, కొత్తపల్లి మల్లయ్య, రాజయ్య, నీల నాగరాజు, శ్రీనివాస్, నాగరాజు, మందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కామారెడ్డి గ్రామీణ ఎస్సై బాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కామారెడ్డి మండల రాఘవపూర్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి మాట్లాడారు. పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు నరేశ్, జీపీవో రవి, వార్డు సభ్యులు తదితరులున్నారు.

హోటళ్ల తనిఖీ

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆహార భద్రత జిల్లా అధికారి విక్రం అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం వివిధ హోటళ్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆహార పదార్థాల తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వంట గదులు శుభ్రంగా ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

పంటల వివరాలు నమోదు

గిద్ద(రామారెడ్డి), న్యూస్‌టుడే: సర్వే నంబర్ల వారీగా పంట వివరాలను నమోదు చేయాలని ఏఈవో రాకేష్ అన్నారు. సోమవారం గిద్ద గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గ్రామంలో అందుబాటులో ఉండి సర్వేయర్‌కు వివరాలను చెప్పాలన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, లక్ష్మణ్, రఫిక్, సర్వేయర్స్ లింబాద్రి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణశోభ

పిట్లం రామలింగేశ్వరాలయంలో స్వామి వారికి అన్నపూజ

పిట్లం, న్యూస్‌టుడే: పిట్లం మండలం చిన్నకొడప్‌గల్, పిట్లం రామలింగేశ్వరాలయం, రాజరాజేశ్వరాలయాలు శ్రావణ శోభ ను సంతరించుకున్నాయి. భక్తులు స్వామి వార్లకు అభిషేకం, అర్చనలు, అన్నపూజలు చేశారు. మంగళహారతులు అందుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతల సహకారంతో అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి బస్తాల సిమెంట్ విరాళం

వేడుకల్లో పాల్గొన్న పైడి ఎల్లారెడ్డి

లింగంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బంజారా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పైడి ఎల్లారెడ్డి పాల్గొన్నారు. స్థానికంగా నిర్మిస్తున్న సంత్ సేవాలాల్, జగదాంబ మాత ఆలయ నిర్మాణానికి వెయ్యి సిమెంట్ బస్తాలను విరాళంగా అందజేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భాజపా నాయకులు క్రాంతి కుమార్, రజినీకాంత్, ప్రవీణ్,నరేష్, రమేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వరుడి సేవలో విద్యార్థులు

విద్యార్థులతో ఆలయ కమిటీ సభ్యులు

భిక్కనూరు, న్యూస్‌టుడే: శ్రావణ సోమవారం సందర్భంగా భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో స్థానిక చైతన్య విద్యానికేతన్ విద్యార్థులు వాలంటీర్ సేవలు అందించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు లింబాద్రి విద్యార్థులను, పాఠశాల కరెస్పాండెంట్ రేణుకుమార్‌ను అభినందించారు.

ప్రత్యేక పూజలు

హారతి ఇస్తున్న భక్తులు

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని చాముండేశ్వరీ ఆలయంలో సోమవారం సంకష్ట హర చతుర్థి పూజలు నిర్వహించారు. వినాయకుడికి అభిషేకాలు చేశారు. న్యాయవాది పెద్దబచ్చగారి రాంరెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సిద్ధారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

బాన్సువాడలో 6న బోనాలు

బాన్సువాడ, న్యూస్‌టుడే : బాన్సువాడలోని బారెడి పోచమ్మ ఆలయం వద్ద ఈ నెల 6న బోనాల ఉత్సవం నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఆలయానికి రంగులు వేయించడం, మొక్కలు నాటడం, పరిసరాలు శుభ్రం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పరిశీలించారు. కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణ, సాయిలు, నగేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఫోరం కార్యవర్గాల ఎన్నిక

కామారెడ్డి: నూతన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గంజ్ ఉన్నత బడిలో సోమవారం హిందీ ఫోరం కామారెడ్డి మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా సంతోష్, మహిళా కార్యదర్శులుగా వనజ, స్వప్న తదితరులు ఎన్నికయ్యారు. హిందీ భాషా అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని ప్రతినిధులు వెల్లడించారు.

రామారెడ్డి, న్యూస్‌టుడే: రామారెడ్డి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ ఫోరం మండల స్థాయి కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జ్యోత్స్న, కార్యదర్శిగా షకీల్, మహిళా కార్యదర్శిగా మంజులత, పాల్వంచ మండల అధ్యక్షుడిగా అశోక్, కార్యదర్శిగా రాజేందర్, కోశాధికారిగా సుధీర్‌కుమార్, మాచారెడ్డి మండల అధ్యక్షుడిగా రాములు, కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా వినోద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడిగా బలవంత్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మాధురి, మహిళా కార్యదర్శిగా విజయలక్ష్మి, కోశాధికారిగా దశరథంలను ఎన్నుకున్నారు.

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: సంఘం అధ్యక్షుడిగా మహమ్మద్ మోహినొద్దిన్, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ, మహిళా కార్యదర్శిగా కవిత, కోశాధికారిగా అవినాష్, సంయుక్త కార్యదర్శులుగా రాజేందర్, జ్యోతి, సురేఖలను ఎన్నుకున్నారు.

బీర్కూర్, నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే : దుర్కి ఉన్నత పాఠశాలలో బాన్సువాడ డివిజన్ బాధ్యుడు కృష్ణ, నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల హిందీ ఫోరం నూతన కార్యవర్గాన్ని వేర్వేరుగా ఎన్నుకున్నారు. బీర్కూర్ మండలాధ్యక్షుడిగా మారిబా, ప్రధాన కార్యదర్శిగా మారుతి, మహిళా కార్యదర్శిగా ఆమ్రపాలిని ఎన్నుకున్నారు. నస్రుల్లాబాద్ మండలాధ్యక్షుడిగా గురుదాస్, ప్రధాన కార్యదర్శిగా అనిత, కార్యదర్శిగా కల్పనలను ఎన్నుకున్నారు.

తల్లిదండ్రులపై దాడి చేసి.. బాలిక అపహరణ

☛ ఆపై లైంగిక దాడి.. పోక్సో కేసు నమోదు

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: అర్ధరాత్రి సమయంలో స్నేహితులతో కలిసి బాలిక తల్లిదండ్రులపై దాడి చేసి, అపహరించారు... అనంతరం ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో వెలుగు చూసింది. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతులు, ఇద్దరు కుమార్తెలతో బతుకుతెరువు కోసం నగరానికి వలస వచ్చారు. భవన నిర్మాణ ప్రదేశాల వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. కొంతకాలంగా ముత్తంగి డివిజన్ పోచారం శివారులోని ఓ భవన నిర్మాణ ప్రదేశంలో గుడిసె వేసుకొని నివసిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో రామేశ్వరం బండ వీకర్స్ సెక్షన్ కాలనీకి చెందిన, డ్రైవర్‌గా పనిచేసే 24 ఏళ్ల మహ్మద్ అలీమ్ పాషా, తన స్నేహితులైన ముద్దం రాజు, వడ్డే రాజేశ్‌లతో కలిసి వారుంటున్న గుడిసె వద్దకు వచ్చారు. వారి పెద్ద కుమార్తె(17)ను అపహరించి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బాలిక తల్లిదండ్రులు అడ్డుకోవడంతో.. వారిపై కర్రలతో విచక్షణరహితంగా దాడి చేశారు. అడ్డొచ్చిన బాలిక సోదరిని మద్యం సీసాలతో కొట్టారు. అనంతరం బాలికను తీసుకొని వెళ్లిపోయారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పాషా ఇంటి సమీపంలో సోమవారం ఉదయం బాలికను గుర్తించారు. ప్రేమ, పెళ్లి పేరిట మాయమాటలు చెప్పి, బాలికపై పాషా లైంగిక దాడికి పాల్పడినట్లు తేలడంతో.. ఆమెను భరోసా కేంద్రానికి తరలించారు. పోక్సో కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో సోమవారం నలుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 79వేల నగదు, నాలుగు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు చెప్పారు.

చిరుత సంచారం

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: నాగిరెడ్డిపేట్ మండలంలోని వెంకంపల్లి గ్రామ శివారులో చిరుత సంచారం కలకలం రేపింది. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన మాసిని సత్యనారాయణ అనే రైతు పొలానికి వెళ్తుండగా చిరుత కనిపించింది. భయాందోళనకు గురైన ఆయన ఊర్లోకి వచ్చి స్థానికులకు సమాచారం ఇచ్చారు. వారంతా వెళ్లి చూడగా చిరుత పక్కనే ఉన్న గుట్టపైకి వెళ్లినట్లు గుర్తించారు. అటవీశాఖ అధికారి వాసుదేవ్ గ్రామానికి చేరుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సంఘం అభివృద్ధికి కృషి

ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

పిట్లం, న్యూస్‌టుడే: పిట్లం ఆర్య వైశ్య సంఘం పట్టణ, మండల కమిటీ నూతన పాలకవర్గాల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం వైశ్య సంఘ భవనంలో నిర్వహించారు. తొలుత వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ కమిటీ అధ్యక్షుడిగా బొడ్డ బాల్‌రాజ్, మండల కమిటీ అధ్యక్షుడిగా మంచి విజయ్ ఎన్నికయ్యారు. ఆయా పాలకవర్గాలతో ప్రమాణస్వీకారం చేశారు. సభ్యులు కమిటీ ప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. సంఘం ప్రగతికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

సదాశివనగర్, న్యూస్‌టుడే : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లిలో పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వారు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచి లాల్‌సింగ్, ఉపసర్పంచి మార రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్ , నారాయణ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇవ్వాలని నిరసన

గాంధారి, న్యూస్‌టుడే: అర్హులైన వారికి మండలంలోని చిన్నగుట్ట తండాలో పోడు హక్కు పట్టాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గిరిజన రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం పార్టీ ఎల్లారెడ్డి ఇన్‌ఛార్జి కార్యదర్శి మోతీరాం నాయక్ , కిషన్‌రావు, ప్రకాష్, బలరాం, చందర్, గణేష్, సురేందర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu